Reg. No. M. 2580.
To
M. R. Ry.

సంవత్సర చందా రు. 4 లు.




జమీందారీ రైతు సంఘ పక్షమున ప్రకటింపబడు వారపత్రిక.

సంపుటము॥ ౧. శనివారము. 26-9-1931. నెల్లూరు. సంచిక ౨౪

## ముల్లు, మొగ్గ.

హాలికుడు.

దేశానికి చుట్టుకొన్న ఆర్థిక చీడ గాక నెల్లూరికి నాటకాల చీడ ఒకటి ఉపరిగా అంటుకొన్నది. బరహంపురం మొదలు ప్రొద్దుటూరి అదివారి దాకా (వీరు రాబోతున్నారు.) నెల్లూరుపై దాడి. దినంమార్చి దినం రాత్రి నాటకాలకోపిపే, కంట్రాక్టర్లకు మాడుచెక్కలు మిగలక పోయినా విదేశ నటకులు కేబూనిండా చిల్లరడబ్బులతో వూరుచేరటం అయింది. కడుకని కాఫీహోటళ్లలో దీర్ఘోపన్యాసాలు సాగించే పెద్దలే ప్రతినాటకానికి పుత్రకళత్రస్నేహ పరివార సమేతంగా వెయూరు! ఇట్లా డబ్బు వస్తుంటే ఉత్తరాదివారు యీ వూరికే కాపరాలు మార్చుకొని దినానికి రెండాటల వంతున తప్పెట్లు కొట్టించరూ!

ఇంతకూ యీ నాటకాలు చెత్త సరుకులో మునిగినరకం. కథ సంఘటన శూన్యము. పాత్రలు ఔచితీ భంగానికి శాస్త్రోదాహరణాలు. కానీ పావలా టిక్కెట్లువారికి నాటకం అయిన ఉదయం మొదలు పదిరోజులు దాకా పారాయణగ్రంథమైయుంది. వీరికి వ్రాసిన నాటకాలకు పెద్దలు పోవడం దురదృష్టం. దోమల బాధ ఇత్యాది గృహంలోని యీతి బాధలు పడలేక నాటకాలకు కాలక్షేపానికిగా పోయ్యే పెద్దలు మన్నించాలి. వచ్చేవారి అభిరుచులకు తగినట్లు నాటకాన్ని సృష్టించడం కాఫీహోటలాయనపని. ప్రేక్షకులకు మానసిక, వైజ్ఞానిక, ఆధ్యాత్మిక శక్తుల వృద్ధిచేయను గొప్పగా గ్రంథాల వ్రాయాల్సిందేగాని పూటకూళ్ళమ్మ కూరల పని కవికితగదు.

ఆంధ్రులు వైజ్ఞానిక దివాల తీసివున్నారు. వాఙ్మయసృష్టి శక్తి ఇంతవరకునసే చేయలేదు. అసలు ఆయనపేరు పాతాళానికి త్రొక్కి అనుకరణం చేయడంలో దిట్టలైపోయినారు వీరాంధ్రులు. పైగ యీ దొంగిలింపులో ప్రతిదీ చెడిపోయింది. సృష్టిస్తే ఏ ప్రతాపరుద్రీయం, కన్యాశుల్కం మాదిరి వుండాల సముద్రతీరాన లైట్ హౌసుల మాదిరి. పురాణకథను తీసికొని మెరుగుపెట్టితే శాకుంతలం మాదిరి. వ్యక్తి కథ వ్రాస్తే అనవసర హాస్యంతో చెడినా రామదాసుమాదిరి వుండాల! లేకుంటే మహాకవి డి. ఎల్. రాయి నాటకాలు వ్రాయకూడదా? యీ మహా మహా స్వయందత్త బిరుదాంకితులు నాటిం ఆడి దేశానికి ఇంత పుణ్యం పురుషార్థం కూర్చకూడదా?

బిరుదాలు ఆంధ్రదేశంలో అసహ్యమైనవి. అభినవశబ్దం పాపం చేసుకొన్నది. ప్రతి కథానాయకుడు అభినవ కళంకితుడైపోతున్నాడు. చిల్లర సరుకులకే పెద్ద బిరుదాలుండి (నూటికి 90 కి అర్థాలు లేవు) రాఘవాచారికి లేకుంటె నవ్యతాంటి ఆయనను తగిలించారు ఒకటి. నాటకాలో అపకేపక చేసుకొట్టి ఆయన దీనిని విసర్జిస్తే లోకోపకారం చేసినవారౌతారు.

ఇక మావూళ్లో ఆడిన, వెల్లువగా మనుష్యుల వర్తకాలకు లాగిన కొన్ని నాటకాల మచ్చుగ చూపితే చూడండి. రంగూన్ రౌడీ. అబ్బా! ఆహావ మస్తకం అసహ్యం, నానీ మా ఫోట్లకు యింత ఆనందం గూర్చిన నాటకమే లేదు. షేక్స్పియర్ ఒక హత్యను నాటకంలో చూపి చూపకుండా చెప్తే కంపించిపోతాం. వీంట్లో డాం డాం అని నిమిష నిమిషానికి కాల్చి చంపుతుంటే నిద్రపోయ్యే బిడ్డ గూడా శబ్దానికి ఉలిక్కిపడటంలేదు! చూపులను కొన్న పాతివ్రత్య మహిమ వ్యభిచార కోలాహంలో మసైపోయింది.

భక్త కుచేల. కుచేలుని భక్తునిచేసి కవిగారు పోతనను వెలివేశెప్పివాడు. ప్రాతస్నేహితునివలన మేలు పొంది తర్వాత కృతజ్ఞత చూపలేక తన్మయుడైన యోగ్యుడు కుచేలుడు. యీ భక్తిగాడు భవాన్ని యిప్పించింది. ఇక మహాపురాతపాత్ర కృష్ణుడు. ప్రాతస్నేహితునికి నిష్కామ్యమానసంలో నిధులగూర్చిన దైవమ్యుడైన మిత్రుడు. యీయనను ఆధిక్యతలేక పోవడం కృష్ణుని కర్మ. మనవారి శూన్య ప్రతిభలు క్రొత్త ఇండ్లను కల్పించలేవు, ప్రాత గ్రంథాలలో వాటిని అంగంచేసికొని దానిని పోషించనులేవు. దీనికి భక్తకుచేల మహోజ్జ్వలోదాహరణము. నెపోలియన్ చక్రవర్తి అయిన తర్వాత ఇల్లే పేదరికంలో ఆడుకొన్న వారినందరి నిధిపన్నులకేశాడు. అల్లి చేయూతండి యిది ఎంత గొప్ప గుణమో! ఇది గాక వీంట్లో శిశుపాలుడు పెట్టే బాధలలో గాంధీ సాంబమూర్తి నాగేశ్వరావు మొదలైనవారే జెయిళ్లకు పోగా నాకేమి అని కుచేలునిచే అనిపించడానికంటే బుద్ధిమాంద్యం ఇంకోటి వున్నదా! ఇట్లాంటి పుస్తకాలన్నిటినీ కాల్చినా మనపాపం తీరుతుందా! ఈ పద్యానికి వన్సుమోరు రావచ్చు! అది మన దౌర్భాగ్యమే.

భరణికోట! అపస్మారక్కలగని కల్పనా బ్రహ్మ కవి. రాయబారికి భక్తురాలికను (రాజకూతురు) వ్యభిచారం. మొరటుగా గూర్చి రాజకీయాల నొడివినాడు. ఈ నూతనత్వంలో కల్ల వర్తనం పావులేసింది. సామాన్యమైన కవిబుద్ధి నాల ఇండ్లను పెట్టాలని ఆయనకే అర్థంకాకుండా వ్రాసిన నాటకరాజమిది. పెద్ద నటులు వస్తేనే ఒక సీనుకు ఒక సీనుకు అతుకు కుదరక రక్తిచెడి అరూపం కలిగించింది. ఇంత మురికి కంపు ఏ నాటకం కొట్టలేదు.

అడవాళ్లు వచ్చిన నాటకం అధ్వాన్నం. మగవారికంటే మేలైనా గౌరవం సూర్యేటట్టుండాల ప్రదర్శనం. ఆంధ్రులు యిప్పటికన్న మేలొంగని ఆంధ్రరంగాన్ని వినాశనం నుండి ఉద్ధరించాల.

(2-వ పుట చూడుము.)

## వెంకటగిరి శాసనోల్లంఘనము.

### పండిత జవాహర్‌లాల్ నెహ్రూగారి అభిప్రాయము.

మేజిస్ట్రేటు చర్యల తీవ్రముగ ఖండించుట.

అహమ్మదాబాదు నందు జరిగిన కాంగ్రెసు కార్యనిర్వాహకవర్గ సమావేశమునందు వెంకటగిరిలో 144 వ సెక్షను ఉల్లంఘించుటను గూర్చి చర్చవచ్చెను.

### డాక్టర్ పట్టాభిగారి విశదీకరణము.

ఇది కాంగ్రెసువారు గావించిన ఉల్లంఘనము కాదని అట్లగుటచే అది ఢిల్లీ ఒడంబడికకు భంగము గాదని డాక్టరు పట్టాభి సీతారామయ్యగారు ఇది కేవలము రైతుసమస్య యనియు, ఆంధ్రదేశము నందలి జమీందారీ రైతుల దుర్భరస్థితిని చక్కజేసికొనుటకు కూడినదియు వారు గావించిన శాసనోల్లంఘనము కాంగ్రెసుకు సంబంధము లేదనియు వివరించిరి.

### జవాహరిలాల్ మేజిస్ట్రేటు ఉత్తర్వును ఖండించుట.

కాంగ్రెసు మహానాయకులు పండిత జవాహర్ లాల్ గారు ఇట్లు వచించిరి:—

వెంకటగిరిలో శాసనోల్లంఘనము జరిగిన విషయమునుగూర్చి నాకు విశేషములు తెలియవు. తమ కష్టముల నాలోచించుటకు రైతులు సమావేశమైరని తెలియుచున్నది. అది కేవలము కాంగ్రెసుపని కాదు. కాని కాంగ్రెసువారు సానుభూతి కలిగి అందులో పాల్గొని యుండవచ్చును. సభ ప్రారంభమగుటకు అరగంట పూర్వము 144 సెక్షను క్రింద నిషేధాజ్ఞ బయల్వెడలెను. జమీందార్లు కలిసి అల్లరిచేయుదురను భయము దీనికి కారణమట. ఎవరు మరి చెడి అల్లరి చేసెదరని భయమో వారిని నిషేధపు టుత్తరువులో చేర్చకపోవుట వింతగానున్నది. రైతులు మాత్రమే జరుపరాదని ఆజ్ఞ. అట్టి ఉత్తరువు పక్షపాతమునేగాక తెలివి తక్కువను గూడ వ్యక్తము చేయుచున్నది. ఈ ఉత్తరువు నుల్లంఘించిన పద్ధతి సబబే. ఇది శాసనోల్లంఘనమని పిలువదగినంత విషయము. కాంగ్రెసు కేంద్రమునకు తెలుపుటకు తగు వృత్తాంతము, సత్యాగ్రహికొన్న వ్యక్తిత్వము. సాధారణముగా అట్టి వ్యక్తుల ఉల్లంఘనమునకు దిగరాదు. గాని అవసరపరిస్థితులలో సందర్భమును బట్టి ప్రవర్తింపవలెను. ఒక్కటి మాత్రము స్పష్టము. కాంగ్రెసు ప్రచారము నరికట్టుటకు 144 వ సెక్షను ప్రయోగింపబడుటను చాల కాలము సహింపజాలము.

---

ఇంక చెప్పమనండి. వెనుకటికి వేంకటరాయ శాస్త్రిలవారు సారంగధర అని ఒకటి అది మనవాడు ఆచార్యా అని కనుగొనేదట్లు అని అనుమానపడి తెలిసేటట్లు నాటకం చేసి వ్రాయరాదా అన్నారు. నిన్న మాపూరిలో ఒక నాటకాన్ని కాళిదాస అని గోడకాగితాలు, చేకాగితాలు ప్రకటించాయి. ఇది నిశ్చితమా, పై తాచికమా? సంస్కృత కాళిదాసు వదరే ఆ మహాకవి నాటకకర్త చేతిలోబడి చెడ్డట్లే అకేవారిచేత మర్దనచేయబడింది. ఇది స్థానికులకు న్యాయంగా అన్నదిలేండి. ఒక్కొక్క దానిమీద నే ఒక్కొక్క నాట్యాంబుజం వ్రాయవచ్చు. శలవు.

---

## ఆంధ్రరాష్ట్రీయ జమీందారీ రైతు మహాసభ. వేంకటగిరి.

### ప్రొఫెసరు గోగినేని రంగనాయకులు గారి అధ్యక్షోపన్యాసము.

(గత సంచిక శేషము.)

శ్రీ విశ్వనాథముగారి సూచన ప్రకారము, పైన సూచింపబడిన రెండవమార్గము సాధ్యము కావచ్చు. ఏటులైనను త్వరగాగాని క్రమ క్రమేణ గాని జమీందారీ పద్ధతి తొలగించుటయే పై రెండు సూచనల యభిప్రాయము. వీని రెండింటిని కాంగ్రెసువారు నిరాకరించిరి. జమీందారీ పద్ధతి యుపయోగకరమైనదనియా? న్యాయము లెక్కయే కాంగ్రెసు నాయకుడుగాని, జమీందారులు దేశోపయోగ కార్యములు చేయుచున్నారని కాని, రైతుక్షేమాభిలాషులని గాని చెప్పజాలడు. జమీందారీ పద్ధతియుండుట దేశమునకు బాధకరమని యెవ్వరు చెప్పలేరు. అట్టిచో పై సూచనల నేల నిరాకరించుచో తెలియదు. చూడ జూడ, జాతీయనాయకులు ఇచ్చుచుండిరి జమీందారీ రైతులు పడుకష్టములు, పొందు నష్టములు, అనుభవించు అన్యాయములు, చెల్లించు దండుగలగూర్చి యే మాత్రము తెలియనట్లున్నది.

ఇంతటితో పోక, ఫండమెంటల్ రైట్సు ప్రణాళికలోని విధనయథ్యాయమందు ఐదు ఎకరములకు తక్కువ భూస్థితి కల్గిన రైతులపైయుండు శిస్తులభారము తీసివేయవలయుననియు, మరితర చిన్న రైతులపై పడుభూమి శిస్తుభారము తగ్గించవలయుననియు, అట్లు చేయుటవలన, చిన్న జమీందారులకు వచ్చే నష్టమునకు తగు పరిహారము ప్రభుత్వము కల్గించవలయుననియు తీర్మానించిరి. మద్రాసు యస్టేటులాండు అక్టును చేయుగల ప్రభుత్వమునకట్టి నష్టపరిహారమిచ్చు టగత్యము లేదనియు, ప్రభుత్వమునకు మంచిదిగా తోచినచో, కొందరు జమీందారు రయితులపైబడు శిస్తుల తీసివేయుటకు అధికారము కలదనియు, వారికి తెలియగా యున్నను. శిస్తుతగ్గించు విషయమందుకూడ నష్టపరిహారమను పాశ్చాత్య జమీందారీ పద్ధతిని క్రొత్తగా తెచ్చిపెట్టుట కాంగ్రెసువారునకు న్యాయమా? లేక రయితులపై భూమి శిస్తువేయుట అన్యాయమనుచో, జమీందారీ రయితులమీదమాత్ర మట్టి శిస్తు లుపడుట, అన్యాయమే కదా? తీసుకొన్న శిస్తులకు ప్రతిఫలము కొంతవరకైన కల్గించు ప్రభుత్వమే శిస్తుల తగ్గించుచో, వచ్చినదెల్ల దిగమ్రింగు జమీందారులుమాత్రము శిస్తుల తగ్గించరాదా? వారట్లు శిస్తుల తగ్గించునట్లుచేయుట కింకా నష్టపరిహార మెందులకు?

### భూమ్యాదాయముపై శిస్తు.

జమీందారీలు మాత్రముండవలయునట, జమీందారులకు ప్రస్తుతమువచ్చు విపరీతపు టాదాయములు తగ్గవలెనట. ఇందులకై యొక వక్రమార్గమును పాశ్చాత్యపద్ధతుల ననుసరించి కాంగ్రెసు సూచింపుచున్నది. ఒక పరిమితి లక్షో, అరలక్షో, దాటిన పిమ్మట, భూమినుండి వచ్చు ఆదాయముపై శిస్తు వేయుట అవసరమనుచున్నది. ఈ సూచన నేమాత్రము క్రొత్తదియు కాదు. గొప్ప పరిమార్పులను కల్గించునదియు కాదు. శిస్తుల విచారణ సంఘము, వ్యవసాయ విచారణ సంఘము కూడను, రైతుసభలును వారందరు, ఈ శిస్తును సూచించి యున్నారు. దీని వలన కలుగగల్గిన మార్పెల్ల, పది లక్షల శిస్తులక్షాదాయముపొందు జమీందారునుండి, మహారాజైతే యొక లక్ష ప్రభుత్వమునకు ప్రతిసంవత్సరము చెందునేమో! ఇదియు గ్రుడ్డిలో మెల్లయైనను మిగత తొమ్మిది లక్షల ధనమును తన యిచ్చవచ్చినట్లు ఖర్చుపెట్టుకొను యధికారము, అవకాశము, జమీందారులకు, కాంగ్రెసువార లివ్వతలంచుట, ఇచ్చుట న్యాయమా? ప్రజలకై నిలబడు కాంగ్రెసు ప్రజల ధనమును జమీందారుల హస్తములం దిడుట పాడియా?

### మరణ శిస్తు.

ఇంతటితో వదలముకే, మరణశిస్తుల వేసినను చేయునని కొందరు కాంగ్రెసువాదు లనుకొని భ్రమచెందుచున్నారు. పర్మనెంటుగా నెట్టిలైన యస్టేటుల మీద మరణశిస్తులు వేయుటెట్లు అందులో, ఇమ్పార్టిబులు యెస్టేటులపై నా శిస్తుల వేయుటెట్లు అని విచారింప మొదలిడిన ఈ శిస్తుల నిరుపయోగత బయటపడును. జమీందారులకీ శిస్తు అనుభవమందు అనువర్తించదు.

ఫండమెంటలు రైట్సుద్వారా జమీందారీ రయితులయొక్కయు కిసానుల యొక్కయు ఇబ్బందులు తొలగుమార్గ మేమియు కాన్పించుట లేదు. జమీందారులు, అశ్రద్ధచేయుచో, తెల్వితక్కువవారగుచో, దుర్మార్గులగుచో, పరిపాలనను విచారించుటకు ప్రభుత్వమున కధికారం సహజము కదా!

### గాంధి తత్వము.

ప్రజాభ్యుదయముకై పోరాడుచు ప్రజల తత్వపు మాటలాడు కాంగ్రెసువారు రైతాంగపు రయి

ముల కొట్టి పరుపాయములు కటవో, ఆ పరుపాయములనైన జమీందారీ రయితులకు కల్గించుటకు పూనుకొనవలయును. రైతాంగపు రయితుల భూ స్థితిగతుల నెట్లు బాగుపరచవలయునో, శిస్తు భారమును తగ్గించవలెనో, ఆస్పత్రులు, పాఠశాలలు, గ్రంథాలయములు, యువక విద్యాలయముల స్థాపించవలెనో అటులనే జమీందారీ రయితుల కన్నివిధముల సాయము చేయవలసి యుండును. అట్లుగానో, బొక్కసములో, స్వరాజ్యపు ప్రభుత్వమునకు ధన మవసరము. తగ్గించిన శిస్తులకు నష్టపరిహారమిచ్చి దొరికిన ధనమంతి తమ బొక్కసముల నింపుకొనుటకు జమీందారుల కధికార మిచ్చుటెట్లు సాధ్యమగును. రయితుల కవసరమగు అన్ని పనులు స్వరాజ్యపు ప్రభుత్వము చేయించి కోటిన్నర రూపాయలు జమీందారుల కన్యాయముగా నిచ్చుచుట న్యాయమా? 'గాంధీయిజమ్' లేక 'గాంధి తత్వము' జమీందారీ పద్ధతిని కోరుననియు, గాంధి తత్వము, రూపాయి శిస్తుకు అణాపాయివంతు బాధము ప్రజలకు కల్గించగోరుననియు, గాంధితత్వము, స్వతహాగా కష్టించక, ఇతరుల కాయకష్టములపై యాధారపడువారి నిరసించుననియు, గాంధితత్వము సాంఘిక సేవ చేయుటకుమందు, సంఘమునకు చేరు పురుగులగు, జమీందారుల కోరుననియు, గాంధితత్వము, అన్ని విధములగు అన్యాయములకు ప్రతిబంధకమనియు, జాతీయవాదులందరు గ్రహించుట మేలు.

## జమీందారీ రయితుల కొక హితవు.

ప్రపంచమునందన్ని యెడల, జమీందారీ పద్ధతి నిర్మూలింపబడు చున్నది. ఇంగ్లండులో జమీందారుల ప్రాధాన్యత పూర్తిగా తగ్గినది. 'రయితులకు పర్మనెంటు సెటిల్ మెంటు' సంప్రాప్తించుటయే గాక, శిస్తులను, రైతు ధరయితుస, వేరు వేరుగా జమీందారులకు చిత్తమొచ్చినట్లు మార్చగల శక్తియు పోయినది. ఒక్కొక్క ప్రాంత్యపు భూములన్నిటిపై శిస్తులు హెచ్చింప వలయుచో, లాండు కోర్టు ఆమవారు నిష్పక్షికపు విచారణ చేయవలసి యుండును. దానిముందు లాయరు లగత్యము లేదు. స్టాంపు లవసరము లేదు. ఖర్చు లేమియు లేవట్లు, తుదకు, క్రమ క్రమముగా జమీందారీ లన్నియు తొలగించబడనున్నవి.

డెన్మార్కు దేశమందు మూడుభాగముల జమీందారీల నిప్పటికే ప్రభుత్వముకొని, ఆయా రైతులకు వారు లేనప్పుడు డితరులకు, కిస్తీల వాయిదాలమీద కొనుగోలుధరచెల్లించు ఖండితముపై అమ్ముచున్నది. అట్లు ముందు తానిచ్చిన అప్పుపై వందకు నెలకు పావలాకంటె హెచ్చువడ్డీ నాదేశపు ప్రభుత్వము కోరుటలేదు.

బాల్కను దేశములందు కాంపెన్ సేషను చెల్లించకయే, ఆయాదేశములందున్న జమీందారులను, తరిమివేసి, ఆయెస్టేటులను భాగభాగములుగా చేసి చిన్నచిన్న రైతులకు పానిసపంచి పెట్టి, రైతులకు తను పరపతిని, వ్యవసాయపు పనిముట్లను తదితర సహాయములన్నిటి ఆదేశముల ప్రభుత్వముల చేసినవి. ఇట్టిపరిమార్పులన్నిటి నింతిజయప్రదముగా కల్గించినది ప్రభువులు కారు. విద్యార్థులుకారు, సామాన్య రైతులు. మీలాంటిప్రజలు. జమీందారీ పిష్టముపోయినప్పటినుండి అతివరకు బంజరుగానున్న భూములు సాగు చేయబడుచున్నవి. ఇదివరకు సాగగుచున్న భూములందు, క్రొత్తపంటలు హెచ్చుపంటలు పండింపబడు చున్నవి. వ్యవసాయవృత్తి వృద్ధి బొందినది. రైతులు సుఖులై, సంపదల లొందుచున్నారు. జమీందారులందు తాండవమాడుచున్న దరిద్రము, నిరుత్సాహము, హీనత్వము అన్నియు అదృశ్యమైనవి. ఆదేశములందలి రైతులు, ఒకప్పుడుమీవలెనే శక్తియుక్తు లుడిగిన వారేమో యని కన్పడినవారు. ఈనాడు మంత్రాంగ సభలందు, పార్లమెంటులందు, తమ పెద్దలపెట్టి, రాజ్యమును తామే తమ వారిద్వారా నడుపు కొనుచున్నారు.

రష్యాలో జగత్ప్రసిద్ధి గాంచిన, బోల్షివిక్, ఆర్థిక, సాంఘిక, రాజకీయ విధానములు పొందున్నవి. అప్పటి జమీందారులెల్లరు పదభ్రష్టులైరి. వారి భూములనెల్ల జమీందారీ రైతుల కివ్వబడినవి. ఆ రైతు లీనాడు, ఐశ్వర్యములతో తులతూగుచున్నారా యనిపించుచున్నది. ఒకప్పుడు, సేవకులుగానున్నవారు, ఒకప్పుడు, దాసులుగానుండినవారు, ఒకప్పుడు, కొరడాలచే కర్రలచే దండింపబడినవారీనాడు స్వతంత్రులై, భూస్వాములై సుఖులైయున్నారు.

రైతుసోదరులారా! వారందరివలెనే మీరును వృద్ధి పొందగలరు. వారికి వలెనే మీకును 'హెచ్చు హక్కులు, తుదకు 'భూమిమీదకూడ మీకు కలుగును. అధైర్యపడ నవసరము లేదు. వారికంటె ఎందును మీరు తగ్గిపోవువారు కారు. 'స్వార్థత్యాగముతో సంఘాభివృద్ధికొరకు కొందరైన పూనుకొని తగు ప్రచారము చేయుచో, మేలెంతయో కల్గును. 'జమీందారీ రయితు పత్రికను' మీరు సక్రమముగా నడుపు టగత్యము. జమీందారీ రయితు సంఘమును గట్టిపరచుట మేలు. జమీందారీ రయితుల యుద్యమము నందందరు చేరుట మంచిది. మీమీ జమీందారులు మీకనేకకష్టములు కల్గింపవచ్చు మిమ్ముల కోర్టులపాలు చేయవచ్చు. మీ పశువులు మేత, మీ బిడ్డలకు, త్రాగుటకు పాలుగూడా లేకుండా చేయవచ్చు, మీ యిండ్లను దోయింపవచ్చు, మీ బంధువుల కొట్టించవచ్చు, మిమ్ములనే స్వయముగా హింసించవచ్చు, 'అలనాటి ప్రహ్లాదునివలె, ఈనాటి గాంధి మహాత్మునివలె, అన్నిటికోర్చి, ధైర్యమును విడనాడక, ప్రజాభీష్టముల మదినెంచి, కార్యోన్ముఖులగుడు.

మన జమీందారీ రయితు యొద్యమమున కనేకయంగము లుండుట మంచిది. జమీందారుల తిక్కరించుటొక విధము. శాసనసభ ద్వారా, ఎస్టేటు లాండు ఆక్టును సర్వముగ సవరణ చేయించుట గొప్ప యంగము. కాంగ్రెసు, రయితు సంఘము లాదిగాగల యన్ని ప్రజాసంస్థల సానుభూతి బొందుట మూడవది. మన జమీందారీ రయితు పత్రికను నడపుట నాల్గవది. జమీందారీ రయితు సంఘమును బలిష్టపరచుట ఐదవది. వీని యన్నిటియందు సమానమైన కార్యములు మెండుగా గలవు. జమీందారీ రయితులం దెక్కువగా విద్యాహీనత ప్రచారమునందున్నది. రాజకీయవిజ్ఞాన మినుమంతయేని మన వారికి లేదు. ఐకమత్య మసలే లేదు. స్వార్థత్యాగముచేసి సాంఘిక లాభమునకై రైతాంగపు క్షేమాభివృద్ధికై పనిచేయ నిచ్చగించువారు కానరారు. ఈ లోటుల పోగొట్టుకొను టత్యంతావశ్యకము. ఎలిమెంటరీ పాఠశాలల స్థాపించుట, పిల్లలందరి పాఠశాలలకు తప్పక పంపించునట్లు చేయుట, బడి వదలినవారికి, విద్యావాసన పోకుండుటకుగా, గ్రంథాలయముల పెట్టి, గ్రంథపఠనము చేయించుట మంచిది. ఉపన్యాసముల ద్వారా, హరికథలాదిగాగల ప్రచారకము ద్వారా, పత్రికల ద్వారా, మన ప్రజలయందు, వివిధ దేశములగూర్చి, మన జాతీయోద్యమముగూర్చి తగు ప్రచార మగత్యము. సహకార పరపతి సంఘములను, గ్రామ పంచాయతీలను విరివిగా స్థాపించి, ప్రజలలో, ఉమ్మడి వ్యవహారముల సవ్యముగా నడుపుకొను శక్తి సామర్థ్యములను కలుగజేయవలెను.

## సహాయ నిధి.

ఆపదలందున్న రయితులకు వ్యాజ్యములందు జిక్కుకున్న రయితులకు, సహాయభూతముగా నుండుటకు, జమీందారి రయితు సంఘము పూనుకొనవలయును. అందరికి సంబంధించిన విషయములో, ఏరైతైనను జమీందారులతో వ్యాజ్యమాడుచున్నయెడల ఆ రయితునకు సంఘము తరపున, ఖర్చులలో సగభాగమైనను యిచ్చి రయితుల కేసును నెగ్గించుట, రయితుల ధర్మమై యున్నది. లేనిచో సహాయములేని రయితు యీనాడోడిపోయెనా, ఆ జడ్జిమెంటు నాతగాగొని జమీందారులెల్లరు, మిగిలిన రయితుల బాధల పెట్టజూచెదరు.

## సెలవు.

చెప్పదగు విషయము లెన్నియో కలవు. జమీందారీ రయితుల విచారణ సంఘపు రిపోర్టు త్వరలోనే రానున్నది. తన్మూలముగా నెల్లూరుజిల్లాయందు మన రయితులకు కల్గుచున్న బాధ తీవ్రత తెలుసుకొన నగును.

కొలది వత్సరములలోనే, వారందరు, స్వాతంత్ర్య భారతావనియందు, స్వరాజ్య సంసిద్ధిని బొంది, రాజకీయపు హక్కుల నధికముగా సంపాదించి, ఆర్థిక స్వాతంత్ర్యము బొందెదరు. సందియ మేమాత్రము లేదు. రయితులకు సుదినములు రానున్నవి. రయితు రాజ్యాంగమున రాణింపగ రానున్నాము. 'రయితుది రాజ్యము' అను వాక్కు సఫలమగు గాక.

జమీందారీ రైతు

1931 సెప్టెంబరు నెల తే 26 ది.

శ ని వా ర ము.

## ఈ వారపు ప్రపంచము.

ఈ వారమునందువలె ప్రపంచమున యిన్ని అపూర్వ సంఘటనలు ప్రవర్తింపబడి యుండలేదు. సుస్థిరమైయుండిన సంస్థలు భీషణ భూప్రకంపాఘాతమునకోయన సంక్షుభితములై వికలములైపోయినవి. గత ఇరువదేండ్లుగా నిజరక్తమును పరదేశములకు పానీయముగ ఒసంగిన జర్మనీ పతనమునకుముందే ధనవంతమని పేర్గాంచిన ఇంగ్లండు కోశము శూన్యమైనది. బంగారమే లేక బంగారునాణ్యముల చలామణిని రద్దుచేసినది. దీనిఫలితముగ మనదేశమున వస్తుక్రయములు పెరుగవచ్చును. కాని రూపాయమారకమును తగ్గించమని బ్రిటీషు ప్రభుత్వమువారు భారత ఆర్థికచిక్కుల ఇంకను కలచివైచినారు. స్వకష్టము చేపోషించిన స్వపక్షనిర్ముక్తుడై మ్యాక్డొనాల్డు ఏకాకి అయినాడు. ఆర్థికపత్రమును సరిచేయుటకు లేబరు లిబరలు పక్షములసూత్రవిచ్ఛేదనకారులగు సూచనల అవలంబింపవలసివచ్చుటచే ఎన్నికలు త్వరలో జరుగునని ఊహింపబడుచున్నది.

◆　　◆　　◆

ప్రసిడెంటు హూవరు యీ సంవత్సరము జర్మనీని పోషించినట్లే సమాజవాదమనెడి ఉప్పెనను ఆపినాడు. ఈ సంవత్సరము నష్టపరిహారముల కట్టవలసివచ్చుచో జర్మనీ పునాదులతో గూడ కూలిపోయెడిది. అంత జర్మనీలో యిప్పుడు విజృంభించియున్న జాతీయ సమాజవాదులగు ఫాసిష్టులు హిట్లర్ నాయకత్వముక్రింద జర్మనీ రాజ్యాంగ యంత్రమును వశపరచుకొందురు. అప్పుడు ఉత్తరమున రష్యా, జర్మనులు, దక్షిణమున చండశాసనుడు ముసొలినీక్రింద ఇటలీదేశములు స్వల్పతమ విభేదములుగల బోల్షివిక్ సిద్ధాంతములలో ప్రాంసును ఒత్తివేసియుండును. యూరపు విశేషభాగము సామ్రాజ్యవాద, ధనవాదముల ప్రబలవిరోధి సమిష్టివాదపు ఏలుబడిక్రిందకువచ్చి వేయును. ఇంతకూ గండము తప్పినట్లు లేదు. ఆస్ట్రియాయందు ఫాసిష్టులు విప్లవమును లేవనెత్తిరిగాని అణచివేయబడినది. యిప్పుడు ఆర్థికపు ఒత్తిడిచే ఏదేశము దరిద్రమైనను అది పాటకజన హస్తగతమగుట వాస్తవము.

◆　　◆　　◆

నలుదెసల రేగినతుపాను కల్లోలమధ్యమమున లండనులో ఒకపురాతన భవనమున భారతీయనాయకులు రాజ్యాంగరూపనిర్మాణక్రియా తొల్యమున కూడియున్నారు. పెద్దఉపన్యాసముల చేతనే పురుషార్థము లలవడినవని పూరటజెందు వాగ్వీరులమధ్య తననిష్కళంక మానసతుల్యమగు స్వచ్ఛసమభాషలో గాంధిజీ ఉపన్యాసధోరణి ప్రయోజనము కాల్యసమాలోచనము శీఘ్రగతిని నెరవేర్పుడని చెప్పి ప్రపంచమునకు భయవిస్మయముల గూర్చినారు. ఇవ్వవలమకొనిన దానిని దెలుపమని బ్రిటీషువారిని తరుముచున్నారు. ఇంటా బయట ఉన్న యీ కల్లోల సంరంభములలో రిక్తునిగా మహాత్ముని భారతదేశమునకు పంపుట మహోపద్రవకర అగునని బ్రిటీషు రాజకీయ వేత్త లెరింగి, లేయంబవలు యోచించుచున్నారు. తమయింటనే గాంధి అఖండగౌరవమును బొందుచున్నాడు.

◆　　◆　　◆

భారతము సుషుప్తిలోనుండి అసెంబ్లీయందు దుస్స్వప్నముల గనుచున్నది. ప్రజావాదము యిట్లు ఎన్నడును కృశించియుండలేదు. అచట ప్రభుత్వవాక్కు నిర్నిరోధముగ అవనతాంగములతో పాలింపబడుచున్నది. రయితు ఇక్కట్ల కనుగొనవలయునను అమరనాథుని ప్రతిపాదన ఉపసంహారాస్త్రహతమైనది. ఇప్పటి బెంగాలు శాసనములకు క్రొత్తగా క్రొత్త పత్రికాశాసనము ఒకటి గంగా ప్రోత్సస్వినివలె అవతరించినది. కాంగ్రెసు దౌర్జన్య నిరోధక ప్రచారమును సాగించుచుండ, ప్రతి వేదికయు, ప్రతి పత్రికయు భీరువుల నైచ్యమార్గమగు దౌర్జన్యమును నిరసించుచుండ యీ అసాధారణ చండశాసనమును ప్రభుత్వమేల ఆశ్రయించవలసివచ్చెనదో దోపకున్నది. ఇందు ముఖ్యముగ పసిబిడ్డవలె నూతన జన్మనెత్తిన క్రొత్త ముద్రణాలయములనే ముఖ్యముగ ధరావతు కట్టమని కోరుట హాస్యాస్పదముగనున్నది. క్రొత్త ప్రెస్ బుద్ధి నెట్లుకనుగొని తిర్గన పూర్వకమైన యీ బండనెత్తిన చెట్ట గలరు? నీవు గానున్న నీయబ్బ అనే తోడేలు వాదముగానున్నది యిది. మన బ్యాంకులు నోటుకు రూపాయలనివ్వ నవసరములేదను ఆర్డినెన్సు భారతీయుల అభిప్రాయములు ప్రభుత్వమున ఎట్లు పాలింపబడుచున్నవో చూపుచున్నవి! జహంగీరుగారు దీని నిరసించుచు దెచ్చిన ఉపపాదనము వైస్ రాయిచే చంపివేయబడినది. ఇట్టి స్వాతంత్ర్య ఛాయలను భవిష్యత్ రాజ్యాంగ విధానము సనుయింపజేసిన ఉభయదేశములకు శ్రేయస్కరము.

◆　　◆　　◆

తూర్పు దేశములకు మరల ముసలము బుట్టినది. రష్యావారి అలజడి చైనా తన దేశముచుట్టు నిర్మించుకొన్న గోడను దాటి దేశమున అంతఃకలహములకు దోహదమొసంగుచున్నది. గృహచ్ఛిద్రములచే నలిగిపోవుచున్న నవ్యచీనా అలసిపోయినది. దీనికి దోడు మేలోర్పని జపాను చైనాతో కయ్యమునకు కాలుదువ్వుచున్నది. స్వల్పకారణములకై జపాను మంచూరియాయందు సైన్యమునుగూర్చి చైనాపై కదనకుతూహలముతో యుద్ధజెండా ఎగకట్టినది. క్లిష్టపరిస్థితులచే చైనా ప్రజాస్వామిక అధ్యక్షుడు చాంగ్ యేషేక్ పదవిని వదలుకొననున్నారు. ఇది విషాదకరము. నానారాజ్యసమితి జోక్యము కలిగించుకొని స్వర్గము అణచునని అనుకొనెదము. ఈ రెండు దేశములు పోరాడుకొనుట ఆసియా ఖండమునకు, అందు ముఖ్యముగ తూర్పు దేశములకు మంచిదిగాదు.

———

# నెల్లూరు మండల జమీందారీ రైతు మహాసభ.

తే 8 ది రాత్రి సమావేశ మగుట

బద్దిపూడి వెంకట నారాయణ రెడ్డిగారి స్వాగతోపన్యాసము.

సృష్టియాదిగా భూమిని వ్యవసాయము చేయుచు సస్యములను పండించుచు దేశమును సర్వధాన్య సంపత్తితో నింపుచుండెడువాడు రైతుగా నుండెను. తొలుత ప్రతిదానికి నిట అగ్రస్థానము వహించినవాడు రైతు. రైతు లేనిచో కిరీటములు లేవు. సింహాసనములు లేవు. అంతయు శూన్యమే.

## జమీందారులు

మహమ్మదీయ ప్రభుత్వ కాలమందు సర్కారు వారు సరాసరిగా రయితులవద్ద నుండి సిస్తులు వసూలు చేసుకొనుటకు వీలులేక జమీందారులను సృష్టించిరి. 1802 సం॥ నందు అప్పుడున్న జమీందారులతో ఈస్టు ఇండియా కంపెనివారు పర్మనెంటు సెటిల్‌మెంటు చేసికొని మనల నందరిని వారికి స్వాధీనము చేసిరి. అప్పటినుండియు జమీందారుల పాలనలో బాగోగులు విచారించువారు లేకుండిరి. జమీందారుల నిరంకుశత్వము ప్రబలిపోయెను. 1908 వ సంవత్సరమునందు గవర్నమెంటు వారు రైతులకును జమీందారులకును నొక చట్టముండవలయునని తలంచి "ఎస్టేటు ల్యాండ్ ఆక్టును" ప్రవేశపెట్టిరి. రైతులకును జమీందారులకును సంఘీభావము కుదరక కోర్టులందు కేసులు హెచ్చయిపోయెను. తిరిగి యిప్పుడు మఱియొక క్రొత్త చట్టమును గవర్నమెంటువారు ప్రవేశపెట్ట దలచినారు. క్రొత్త చట్టమైనను రైతుకు మేలు చేయజాలదు.

## జమీందారీ రైతు సంఘము

ఈసంఘ మిప్పటికి సంవత్సరము క్రిందటనే ప్రముఖులగు జమీందారు రైతు సోదరులచే స్థాపింపబడినది. సంఘము ప్రథమముననే అలవిగాని యిబ్బందుల నెదుర్కొనెను. ఈసంఘమునకు కార్యనిర్వాహక సభ్యులే దొరుకుటకు వీలులేకపోయెను. ఎన్నుకొనిన సభ్యులు కొందరు రాజీనామాలు పంపుటయు, కొందరు సమావేశమునకు హాజరు కాకపోవుటయు, కొందరుమాత్రము అతిరహస్యముగా వచ్చుచుండుటయు యీవిధముగా జరుగుచుండెడిది. ఇందులకు కారణము, సభ్యులకు ఉత్సాహము లేక కాదుగాని, ఇంతమాత్రమునకే సభ్యులను జమీందారుల నౌకరులు విశేషముగా నిర్బంధింప మొదలిడినందుకని గ్రహించవలెను. సమావేశమునకు హాజరగుచుండిన సభ్యులకును, వారికి తోడ్పడుచున్న జమీందారి రైతు సోదరులకును పశువులు మేపుకొనుటకు అవసరమైన కంచెలు, సంసారనిర్వాహణమునకు అత్యవసరమైన వంట చెఱకులు సస్యములకు సత్తువకుగాను నుపయోగించుకొనుచుండు ఆకులు మొదలగు యెరువుల నియ్యకుండ బాధించిరి. ఈవిషయమున జమీందారి ఉన్నతోద్యోగస్థులతో చెప్పుకొన్నను, అవిధేయులకిచ్చుటకు వీలు లేదనుచున్నారు. జమీందారులు కలుగ జేయవలసిన సదుపాయములను చేయుమని కోరెడివారిని అవిధేయులని భావించు యీజమీందారి పరిపాలనలో రైతుల కేపాటిలాభము, కలుగునో పాఠకులు నిర్ణయించుకొనగలరు.

## జమీందారు రైతు పత్రిక

ఈపత్రిక మాసంఘయాజమాన్యమున ప్రారంభించిన రెండుమాసములకే యీ పత్రికను ప్రచురించుచుండిన శారదా ముద్రణాలయము ఆర్డినెన్సులో తగుల్కొని నిలిచిపోయినది. ఇతర ముద్రణాలయము వారిని ఈపత్రికను ప్రకటింపుమని కోరగా వారుకూడ ఆర్డినెన్సులో తగుల్కొందుమని భీతిచే ముద్రించుట కియ్యకొనలేదు. ఇప్పటికైనను ద్రవ్యభారముచే సంఘమునకు ముద్రణాలయము స్వంతముగా లభించలేదు. రైతుసోదరు లందరును నేడీచట సమావేశమైతిరి గనుక తమరందరును చేయూత నొసంగి ఈ పత్రికను శాశ్వతముగా జీవింపజేయుదురని మిమ్ముల నెంతయు ప్రార్థించుచున్నాము. ఈ పత్రికయే మన యిబ్బందులను భస్మము చేయగలిగిన రామబాణము. మన నిర్బంధములను పటాపంచలు చేయగల సుదర్శనచక్రము.

## స్థానికసంస్థలు-శాసనసభలు.

స్థానిక సంస్థలకుగాని శాసనసభలకుగాని జమీందారీ రైతుసోదరులలో తమ కిష్టమువచ్చినవారికి ఓట్లనిచ్చి తమ ప్రతినిధిని పంపుకొనుటకు వీలులేకయున్నది. తాలూకాబోర్డు మొదలు శాసనసభలవరకు జమీందారులచే నాక్రమింపబడియున్నవి, ఓట్లిచ్చువారు జమీందారీ రైతులు. స్థానము నాక్రమించువారు జమీందారులు. ఇంతవరకు జమీందారి రయితులు వారిష్టమొచ్చిన వారికి ఓట్లనిచ్చుటకు వీలులేదని ఘంటాపథముగా చెప్పగలను.

## జలాధారములు.

చెఱువులు, యేటి కాలువలు మరమ్మతులేక చాల క్షీణించిపోయినవి. మరమ్మతులు చేయుటకు వీరికి బొత్తుగా గిట్టదు. మరమ్మతులు చేయకున్నను వీరికి శిస్తులు పుష్కలముగా వసూలగుచుండ మరమ్మతులుజేసి జమీందారులు ద్రవ్యము నెందుకు ఖర్చుపెట్టుకొనవలయును? ఈ మరమ్మత్తులు క్రమముగా చేయకపోవడమువల్ల కొన్ని ప్రదేశములలో చెఱువులకు నీరువచ్చు కాలువలు రూపము లేకనే పూడిపోయినవి. చెఱువుకట్టలు మరమ్మత్తులు లేనందున చెఱువులలో కుడకు సరకు భాగమైనను నీరు నిలుచుట లేదు. ప్రక్కనయున్న ప్రభుత్వ గ్రామములలో నీటిపారుదలకుగాను చేయుచుండు యేర్పాట్లు, మరమ్మత్తులు, నూతనాభివృద్ధిపనులు చూచిన నోట నీరూరుచున్నది. పంటలు క్రమముగా క్షీణించుట వలన శిస్తు చెల్లించుటకుగూడ రయితు తానంత స్థితిలో లేడు. ఎస్టేటు ల్యాండు ఆక్టు మరమ్మత్తు విషయములలో నేతిబీరకాయవలె నున్నది. మూలుగుచున్న నక్కపై తాటిపండు పడినట్లు ధరలు మూడవ వంతుకు తగ్గినవి. తగ్గినను రయితులవద్ద శిస్తులు మాత్రము నిలవ యుంచకుండ వసూలు చేయుచున్నారు. రయితులు తిండికి సహితము లేక చాల యిడుములగుడుచుచున్నారు. పండినదంతయు శిస్తుల క్రిందనే చెల్లించుచున్నారు, జమీందారుల నౌకరులు రయితుల రక్తమంతయు పీల్చి పిప్పిజేసి జమీందారులకు పంపినను పాపము! ఖర్చులకే చాలక అప్పులు తెచ్చుకొనుటకు నలుదెసల దేవులాడుచున్నారు. వీరికి రయితులద్వారా వచ్చెడి శిస్తంతయు రయితుల క్షేమమునకై వ్యయపరచుట మరచిపోయిన యీ జమీందారులతో మనకు యేవిధముగా పొత్తు కుదరగలదు.

## అవిభాజ్య ఎస్టేటుల బిల్లు.

ఈ దినములలో స్త్రీలకుగూడ సమానమైన హక్కుల నొసంగవలయునని తీర్మానింపబడు యీ కొన్ని జమీందారీలు మాత్రము విభాగములుగాక యొక్క జ్యేష్ఠునికి సర్వాధికారము నొసంగి యావదాస్తి

యు నతని హస్తమునందుంచి తన సహోదరులకు యేదో కొద్ది గౌరవభృతి నొసంగుట యేటి న్యాయమో యూహించుకొనుడు. మన యాస్తికొక చట్టము, జమీందారుల యాస్తి కొక చట్టము యేల నిర్మింపవలయునో తెలియకున్నది. పైకుటుంబములకు చేరిన కొందరు వీరిచ్చు అలవెన్సులు చాలక యీ జ్యేష్ఠుని కృపకు వేచియుండవలసిన స్థితి యుద్భవించినది. జ్యేష్ఠుడు మాత్రము విస్తారాంశ సంభూతుడు, అతని సహోదరుడు మాత్రము దరిద్ర నారాయణుడు. ఇట్టి భేదము తొలగించుటకు పై చట్టమును గవర్నమెంటువారే రద్దు చేసికొనుటకు మన మెల్లరము తగిన ప్రయత్నములు సలుపవలయును.

### శిస్తులు.

ఈ గ్రామాదులలో శిస్తులు యొక పద్ధతిగా నిర్ణయమై యుండుట లేదు. సమయానుకూలముగా జమీందారుల యిష్టము చొప్పున మార్పు చేయుచున్నారు. ప్రక్కన గవర్నమెంటు గ్రామాదులలో యెకరా యొకటికి 3 రూపాయలు వసూలు చేయబడు భూములకు జమీందార్లు పైర్లవారి పద్ధతిమీద యెకరా యొకటికి 70 రు వరకు వసూలు చేయుచున్నారు. నీటితో అవసరములేని పెసలు, మినుము మొదలగు పైరులకు గవర్నమెంటు గ్రామాదులలో శిస్తులు వసూలు చేయరు. జమీందారులు మాత్రము శిస్తు వసూలు చేసెదరు. ఎండిపోయిన పైరులకు రిమిషన్ కోరెడువారు రెండు విధములుగా నష్టపడుచున్నారు. రిమిషన్ కోరని రయితులవద్ద యిప్పటికిప్పుడే నిర్బంధముగ వసూలు చేయుచున్నారు. కాని అర్జీలు పెట్టుకొన్నవారికి రిమిషన్ యిప్పించే కొరకు రూపాయి 1-కి 0-4-0 లు కొన్నిచోట్ల 0-6-0 లు మామూలు ఖర్చు పెట్టించి లిమిటేషన్ యున్నంతవరకు నిలిపియుంచి, లిమిటేషన్ కలుగునప్పుడు రయితుకు తెలియకనే అసలు శిస్తు శిస్తుకు 3 సం॥ల వడ్డీ ఖర్చులతో సహా డిక్రీలు చేయించి రయితులవద్ద రాబట్టుచున్నారు. అవిధేయుల అర్జీలు అసలే తీసికొనరు. విధేయులవి మాత్రము తీసికొని రెండు విధములుగా నష్టము చేయుచున్నారు.

మొదటినుండియు వ్యవసాయమునకు అయిన ఖర్చు లన్నియు అప్పులు తెచ్చి పెట్టుకొని వ్యవసాయము సాగించి పండుతుందను భావముతో అప్పులు తెచ్చుకొన్నవారికి అప్పులు చెల్లించి, మిగిలిన వానితో తాను తమపిల్లలు కడుపార కొన్నదినములైనను తినెదమని ఆశ యొందు జూచినను కానరాకున్నది. అన్నమో రామచంద్రా యని అల్లాడుచున్న రయితుకు శిస్తు చెల్లించనిదే గాని తమ బిడ్డకంటె యెక్కువగా కాపాడుకొని పశువును బైటికి పోనీయక జమీందార్ నౌకరులు వాటికి మేతగాని తుదకు నీరుగాని పెట్టక నోరులేని పశువులనుగూడ అల్లాడించుచున్నారు.

### పౌరసత్వపు హక్కు

జమీందారీ గ్రామాదులలో ప్రజలను భవించు కొనగలిగిన పౌరసత్వపు హక్కు లేదనియే నా యభిప్రాయము. జమీందారుని యిష్టము లేకున్న పెండ్లిండ్లు చేయరాదు. ఊరేగింపులు జరుపరాదు. మేళములు వాయించరాదు. ఇందుకు తార్కాణము జూపించెదను. ఈ గ్రామమునకు 1923 సం. లో చిత్తరంజనదాసుగారు వచ్చినప్పుడు, దాసుగారిని పెద్దయూరేగింపుతో కొనివచ్చెదరనియు, అట్లు జరిగినయెడల జమీందారి ప్రతిష్టకు భంగము కలుగునని యెంచి పోలీసువారికి "దాసుగారిని యూరేగింపుతో కొనివచ్చినయెడల తమ దేవతాకార్యమునకు భంగము కలుగును" ని రిపోర్టునిచ్చిరి. పోలీసువారు యిదియే సమయమని 144 వ సెక్షనతో హాజరయిరి. దాసుగారి అగమనార్థము కట్టిన జయతోరణము వీరికి చాల ఆక్షేపణీయములట. అందుచే తోరణములన్నియు లాగించిరి. తిరునాలసమయమునందు జమీందారులు తప్ప మరియొకరు మేళములు వాయించరాదట. ఇట్టివి యెన్నియో గలవు. ఇట్టి నిరంకుశత్వపు అధికారము లెన్నడు నిర్మూలమగునో తెలియరాదు.

### కంచల్లు.

పశువులను మేపుకొనుటకు జమీందారు కోరిన డబ్బు యియ్యనిదే రయితుల పశువులు కంచలో గడ్డి మేయరాదు. చెఱువులో నీరు త్రాగరాదు. జమీందారు యేటేట కొంతడబ్బును హెచ్చించుచు కంచెయును రయితులు యెప్పుకొనవలయును. అటు లొప్పుకొనకపోయినచో అనేకమైన యిబ్బందులు రయితు అనుభవించవలసి యుండును. అర్తివరమను గ్రామములో కంచలకు వేయిరూపాయలు జమీందారు లడుగగా యివ్వజాలమన్నందుకు గ్రామస్థులను క్రిమినల్ కేసులలో దింపి నానా యిడుమలపాలు జేసిరి. ఇప్పటికిని కొన్ని సివిల్ కేసులు జరుగుచునే యున్నవి. పుత్తేటి నారాయణ రెడ్డిగారు వారితోటలోని గాలికిపడిన చెట్లకొమ్మలను తమయింటికి తోలుకొని వచ్చినందులకు పోలీసువారిచే క్రిమినల్ కేసు పెట్టించిరి. ఇట్టి విషయములలో పోలీసువారు జమీందారు పక్షము వహించి రయితుల నిబ్బంది పెట్టుట చాల విచారణీయమైన అంశము. తుట్టతుదకు పై కేసును గూడూరులో కలెక్టరువారు త్రోసివేసిరి.

### వలసపోవుట

ఈ జమీందారి పరిపాలనలో జీవించలేమని కొన్ని గ్రామాదులవారు తమ నివాసములనే వదలిపెట్టి అత్యంత ఘనత వహించిన శ్రీ శ్రీ మైసూరు మహారాజా గారికి రామరాజ్యముతో పోల్పతగిన తమ సంస్థానములో వచ్చి చేరుటకు తగిన వసతులు కల్పించి తమ కుటుంబపోషణమునకు తగినంత మాగాణి తమ కిప్పించి కాపాడవలసినదని అర్జీలు పెట్టుకొని యున్నారు. తమ పూర్వీకుల నుండియు రయితులు ఆయాగ్రామాదులలో నివసించుచుండి రయితులు తమ నివాసములను వదలుకొనుటకు సహాసిద్ధపడినప్పుడు రయితునకు యెంతటి నిరాశ, యెంతటి నిస్పృహ, యెంతటి తెగింపు! కలిగినదో మీరలే గ్రహించుకొనగలరు.

### రంగనాయకుల కమిటి

ఈమండల రయితు సంఘమువారు శ్రీ గోగినేని రంగనాయకుల గారి అధ్యక్షతను ఉపసంఘమును నియమించి జమీందారీ రయితుల కష్టసుఖముల విచారించి తెలుపవలసినదిగా తీర్మానించిరి. శ్రీ రంగనాయకులుగారును కమిటీసభ్యులును యిచ్చట జమీందారీ గ్రామాదులకు పోయి చాల శ్రద్ధగా తమ విచారణను సాగించుచున్నారు. శ్రీ రంగనాయకులు గారు గుంటూరు జిల్లా వారయినను యీమండల జమీందారీ రయితుల విషయమై తమపనులను మానుకొని కొన్ని దినములు యిందు నిమిత్తమై వెచ్చించి వ్యయప్రయాసలకు లోనై తమయింగ్లాండు ప్రయాణము సయితము మానుకొని విచారణ సాగించుచున్న వీరికిని, వీరి కమిటీవారికి మా సంఘము తరపున హృదయపూర్వకముగా వందనము లర్పించుచున్నాము.

---

# నెల్లూరుజిల్లా జమీందారీ రైతుసంఘము.

### క్రొత్త ఎన్నికలు.

వెంకటగిరిలో ఈ నెల తే 9 దిన 3 గంటలకు యెన్నికలు జరిగినవి. జనరల్ బాడికి 60 మంది సభ్యులుండవలెననియు, వారిలో 49 మందిని అప్పుడే యెన్నుకొనిరి. తక్కిన 11 మందిని భర్తీజేయుటకు కమిటివారికి అధికార మివ్వబడినది.

### వర్కింగు కమిటి.

పై జనరల్ బాడిలోనుండి ఈ 11 మంది సభ్యులను యెన్నుకొనిరి.

**అధ్యక్షులు.**

1. శ్రీయుత బత్తిన పెరుమాళ్లనాయుడుగారు, బి. యె.

**ఉపాధ్యక్షులు.**

2. ,, చిట్టమూరు వెంకటసుబ్బారెడ్డిగారు.

**సంయుక్త కార్యదర్శులు.**

3. ,, నెల్లూరు వెంకట్రామానాయుడుగారు.
4. ,, బద్దిపూడి వెంకటనారాయణరెడ్డిగారు.
5. ,, కటికనేని వెంకట్రామారావుగారు.

**సభ్యులు.**

6. ,, కటికనేని కల్యాణరావుగారు.
7. ,, వేనాటి మునిస్వామిరెడ్డిగారు.
8. ,, గుజ్జలపూడి వెంకటసుబ్బానాయుడుగారు.
9. ,, కాళహస్తిరెడ్డి వెంకటసుబ్బారెడ్డిగారు.
10. ,, వెన్నెలకంటి అప్పారావుగారు.
11. ,, మునుపూరు పిచ్చిరెడ్డిగారు.

ఈకమిటికి కోరం 5 గా నిర్ణయించబడినది.

నెల్లూరు వేంకట్రామానాయుడు,
సం. కార్యదర్శి.

---

# దాసీజన విముక్తివాంఛ: వెలమ జమీందారుల నిరోధము.

### వేంకటగిరి నగరి దాసీజనముల యిక్కట్లు.

తనజన్మభూమియొక్క దాస్యవిముక్తిని ముప్పది యారుకోట్ల భారతీయుల క్షేమముకొరకును, సకల విరాగియగు గాంధి మహాత్ముడు మహాత్యాగము గావించుచు సాంఘికదాస్యము సాంఘిక పతనము మొదలగుట విచ్ఛిన్నముచేయ మహాదీక్ష బూని యున్న కాలమునందు "యత్నే కృతే యదినసిద్ధ్యతి కోత్రదోషః" అనునట్లు యిదియొక యత్నము సాంఘిక దురవస్థ బాపుటకు.

### హీనతమమైన వేతనము.

లోకమునందు సాధారణముగా మానవుని జీవితమునందలి మంచి చెడ్డలను తన సంపాదనము కొరకే యాధారపడి యుండును. దానంజేసి తొలుదొల్త యీ దాసుల వేతనము విషయమై కొంత చర్చింతము. దాసులని పేరు వడసిన యీ వెలమ జమీందారుల సేవకుల దురవస్థ వేంకటగిరి సంస్థానమునందే పున్నతపీఠము నలంకరించి యున్నదని చెప్పుట కెంతయో చింతిల్లుచున్నాను. వీరి వేతనములు మాసమునకు మూడు రూప్యములనుండి మూడు పావలాల వరకు యేర్పరుపబడి యున్నది. ప్రపంచమునందే మానవుడుగాని యింత స్వల్ప వేతనముతో యే వృత్తినిగాని అవలంబించి యున్నాడా యని యోచింపవలసియున్నది. యింతకన్న పది రెట్లధికమయిన వేతనముతోనైనను, నిజదార సుతోదర పోషణగాని, చూపరుల మనము భ్రమజెందునట్లు ఈ నిరంతర స్నానగోమల్లువస్త్ర ధారణగాని యితరులకు సాధ్యము కాదు. దీనిని బట్టి యూహ వీరికి నియమింపబడిన వేతనమునకన్న, యీ జమీందారులవలన తదితరార్జన యెంతయో గలదని చెప్పక తప్పదు. కావున, ధనార్జనకు సులభమైన మార్గములు వీరికి కరతలామలకములై యుండ జమీందారుల సేవ పరమపదమని వీరేల చెప్పకుందురు? వీరి స్థితిగతులను తెలియనివారు, ఆ తలపాగాలను, దుస్తులను గాంచినంతనే జమీందారులవద్ద యెంతగొప్ప హోదాలో యున్నారో యని వంగి వంగి సలాములు చేయక మానరు. దీనికి తోడు స్తోత్రపాఠములు యీ సేవకులకు వెన్నతోపెట్టిన విద్య. మన జమీందారులకీ పాఠము చెవిన సోకినంతనే ఆనందపరవశులగుచు తమ సేవకుల వచనముల కన్నిటికిని గొప్ప విలువను గలుగజేయుచు, తామనుభవించు భోగము లన్నిటియందును, ఆటపాటల యందును, వీరికి కొంత స్థానము నొసంగుచున్నారు. ఇట్టి ఆనందాంబుధియందు మునిగి యున్నంతవరకు యితర లోకముతో వీరికేమి పని. యిది యిటులుండ కొందరు సేవకులు తమకు లభించు స్వల్ప వేతనము మీదనే ఆధారపడవలసిన వారుగా నున్నారు. తర తరములుగ వంశాను క్రమ గతముగ, యీ వేతనము యేర్పాటుచేయబడి యున్నందున, హెచ్చించుటకు వీలులేదట! దీనినిబట్టియే కాబోలు పాపము! పెక్కుమంది సేవకులు, యీ జమీందారుల ఉచ్ఛిష్టాన్నముకుగూడ పాల్పడవలసి యున్నది. మానవజన్మమున కింతకన్న నీచమైన గతి గలదే?

### వివాహ నిరోధములకు కారణములు.

పోనిండు; యీ సేవకులు తమ వివాహసందర్భముల యందైనను, తమ స్థితిగతులను చక్కబరచుకొందురాయన్న అచ్చటగూడ కొన్ని కష్టములను సికకొని తెచ్చుకొనుచున్నారు. ఈ జమీందారుల సేవయందుండు, ప్రతిదాసీకిని, దాసునకును, దేహ, రక్తసంబంధమైన బాంధవ్యము లున్నవని చెప్పక తప్పదు. అట్టి యెడ ఒక దాసీ పుత్రుడగువాడు, దాసీ పుత్రికను వివాహమాడుట కిష్టపడుటలేదు. వీరి గౌరవమునకు భంగమట! శ్రీయును, బలమును, రూపమును, గుణమునుగల కన్యలే వీరికి గావలయునను కోరికతో దాసీ కన్యలను త్యజించుచున్నారు. ఆహా! తమ సంఘమును పీల్చి పిప్పిజేయు దుర్వ్యసనములలో నగ్రగణ్యమై దనరారు వెలయాలి తనమును మాన్పుటకు ప్రథమ సోపానమగు యీ దాసీల వివాహములకు తోడ్పడిన యెడల దేశమాతయొక్క తీరని వగను మాన్పిన వారగుదురు గదా. తొలుతనుండియు, యీ సేవకులు యీ వివాహముల విషయమై శ్రద్ధ తీసికొనియుండిన, మొన్న మొన్న వెంకటగిరిలో విధించిన జమీందారుల కఠినశాసనముల కవకాశమే యుండి యుండదుగదా. తమ సేవకులలో పెక్కుమంది నిరక్షరకుక్షులని యెరింగియు, యుక్తాయుక్త పరిజ్ఞానమే వారికి లేదని తెలిసియుండియు, జమీందారులైనను లోక కల్యాణమునకు మార్గమైన, తమ దాసీల వివాహముల కడ్డురాకుండిన తమ ఘనత యింతకన్నను వన్నెకెక్కి యుండును గదా. యీ వివాహములను ప్రోత్సహించిన యెడల తమ చాకిరికి యితర స్త్రీలెవరును దొరకరను భయము తప్ప మరేమియును కాన్పించుట లేదు; యీ వివాహముల కడ్డుపడనిచో కొంతవరకు దేశమాత శీలము కాపాడిన వారగుదురు గాన, యిందులకు లేనిపోని ఆటంకములను గలుగజేయకుండిన, జమీందారులు తలచునట్లుగా, వారి సేవా విషయమై యేలాటి యిబ్బందులు కలుగనేరవని దృఢముగా విన్నవించుకొనుచున్నాను.

### అవమానకరమగు సోదా.

యీ దాసీల విషయమై, యిటీవల వెంకటగిరి సంస్థానమునందు మరియొక శాసనమేర్పడెనట. దాసీలు తమ చాకిరినంతయు దీర్చుకొని అంతఃపురమునుండి వెలుపలికివచ్చునపుడు, తామేమియు నపహరించి తమ వస్త్రములలో దాచుకొని రాలేదన్నట్లుగా కావలియుండు సిఫాయిలకు చూపిరావలయునట. యేనాలుగు వత్సరములనాడో, యొసంగబడిన సంపూర్ణ జీర్ణదుస్తులను ధరించుకొన్న యీ సిపాయిలు తమ దురవస్థ కొరకే వేశయు చింతించుచు యిట్టి వుత్తరవులను నెరవేర్పవలయునన్న వారికే తలవంపులుగానున్నది. యింతకన్న యీ దాసీలకు అపకీర్తి చేయకలదా యీ అవమానమును తమ బంధువులగు దాసులు మాత్రము సాగ్గొనుటలేదా? వృత్తియా సేవాకావృత్తి: జీవనమా పశువృత్తి. వీటికితోడు యీ అపయశము ననుభవించు కర్మ ప్రాప్తించినపుడు జమీందారుల సేవయం దెట్టి భాగ్యము సౌఖ్యము, గౌరవము పొందుచున్నామను నమ్మకముతో తమ జీవితమును వృధా పరచుకొనుచున్నారో గ్రాహ్యము గాకయున్నది.

# గాంధి మహాత్మునికి లండనులో అఖండ గౌరవము.

ప్రయాణమునవింతమైన క్రొత్తయేర్పాట్లు.

గాంధి మహాత్ముడు లండను చేరినది మొదలు కనివిననిరీతి అఖండ సత్కారములు జరుగుచున్నవి. ప్రతివ్యక్తియు గొప్పగ గౌరవించుచున్నారు. ఒకనాడు జనసమ్మర్దముచే చూడదలచుకొన్న న్యూయార్కుమేయరు వెనుకకు మరల పోవలసివచ్చినది.

గాంధిజీ విడిదియగు కింగ్స్లే హాలు నుండి సభాభవనమునకు పోవుటకు చాల ఆలస్యమగుటచే విడిదినిమార్ప యత్నించుచున్నారు. ఈ లోపల పోలీసువారు ఒక క్రొత్త విధం కల్పించినారు. మహాత్ముని కారకు ముందు ఒక గంటకొట్టుచూ ఒక పోలీసు కారు పోవును. జనసమ్మర్దమును, ట్రాఫిక్ నిరోధమును తప్పించుకొనుటకు గాంధిజీ కారు చట్టమునకు వ్యతిరేకముగ ఏప్రక్కకైనను పోవచ్చును.

ఫెడరల్ స్ట్రక్చర్ సభయందు మహాత్ముడు కాంగ్రెసు కోర్కెల విశదపరచి వాదములందు కాలయాపన మగుచున్నదని పగచిరి. వీరికోర్కెల బ్రిటీషువారు సాదరభావముతోడనే గ్రహించిరి. పార్లమెంటు సభ్యులకు ఉపన్యసింప బోయినప్పుడు హ్యాటులదీసి అతివినయమును ప్రదర్శించిరి. మూడు పక్షములవారికి ఉపన్యసించెదరు. ల్యాంకాషైరుకు ప్రయాణము ప్రస్తుతము ఆగినది. చర్చిల్ మొదలగు భారతాశయ విరోధులతో గూడ త్వరలో సంభాషింపనున్నారు. లోకప్రసిద్ధిగాంచిన హాస్య సినిమా నటకావతంసుడు చార్లీచాప్లీగారు లోకోత్తరపురుషుడు గాంధి మహాత్మునితో ఒకగంటసేపు సంభాషించిరి. ఉత్సాహవంతులగు ప్రజలు బిడ్డలు మహాత్ముని కారుని ముట్టడించిరి. రౌండుటేబిల్ సభయందు తనకు కార్యదర్శిగా హిందూ పత్రికా సంపాదకులు ఎ. రంగస్వామి అయ్యంగారిని నియమించుకొనిరి. ఫెడర్ల్ విధానమునకు కొందరు సంస్థానాధిపతులు విముఖత జూపుచున్నను ఎన్నదగిన నిరోధములు కలుగుటలేదు. గాంధిజీ క్రొత్తప్రెస్ బిల్లును, రూపాయ మారకము గూర్చియు తీవ్రముగ ఖండించిరి.

### ఇంగ్లండులో బంగారు మారకము అంతరించినది.

ఇంగ్లండునందు బంగారమంతయు అయిపోయినది. మన దేశంలో రూపాయవలె ఆ దేశములో బంగారు పౌను చలామణి అయ్యేది. బంగారు లేనందున ఇప్పుడు బ్రిటీషు ప్రభుత్వమువారు బంగారు మారకమును ఎత్తివేసినారు. అనగా ఇకముందు నూరుపౌనుల నోటును ఖజానాకు తీసికొనిపోతే బంగారు సవరుల నివ్వవలసిన బాధ్యత ఇంతకు ముందువలె ప్రభుత్వమునకు లేదు. మన దేశములోగూడ ఇకను నోటుకు రూపాయల ఏ బ్యాంకుగాని, ఏ ప్రభుత్వకోశముగాని యివ్వదు. దేశములో ఇకను నోట్లమారకమే దేశములో వుండును. ఇట్లు శాసనమయ్యే లోపల ప్రజలు నోట్లకు డబ్బు యివ్వమని ఒక్కసారి బ్యాంకుల ముట్టడిస్తారను భీతిచే ఇంగ్లండులో ఇక్కడా బ్యాంకుల మూడు దినాలు మూసివేసిరి. ఇక మన సవర క్రియము అంగడివాని యిష్టానుసారముగ ఎదుగును. దీనివలన మనదేశములోని దేశవ్యాపారులు ఎక్కుడు డబ్బును కట్టవలసియుండును. త్వరలో అన్ని వస్తువుల క్రియము కొంచెము హెచ్చవచ్చును. బంగారమంతా అమెరికా ఫ్రాన్సు దేశములో కుప్పలు బోసివున్నది. యిప్పుడు 8 కోట్ల సవరల అమెరికావారు ఇంగ్లండుకు అప్పయిచ్చిరి. ఇంకనూ యివ్వనున్నారు. ఫ్రాన్సుగూడ ఇట్లే సహాయపడనున్నది. ఈ నూతన మార్పు భారతదేశమునకు నష్టదాయకమని భారతీయ నాయకులు గాంధి, బిర్లా, కేహాజీ జహాంగీరు, షణ్ముఖంశెట్టి మొదలగు ఆర్థికవేత్తలు తీవ్రముగ నిరసించుచున్నారు. జహాంగీరుగారు అసెంబ్లీలో యీ విషయమై ఒక వుపపాదనగొనిరాగా వైస్రాయిగారు అనుజ్ఞనివ్వక కొట్టివేసిరి.

### గోపాలరెడ్డిగారికి సన్మానము.

27 తేది యందు యువజన సమితివారు నెల్లూరు మండల యువజన సంఘాధ్యక్షుడు బెజవాడ గోపాలరెడ్డిగారికి సన్మానం నొసంగెదరు. నాడు అచట పతాకవందనోత్సవము సభ జరుగును.

### మోపూరు జమీందారీ రైతుసభలు.

రాబోవు నెల 3 తేది వేంకటగిరి సమీపమునందున్న మోపూరునందు మోపూరు ఫిర్కా జమీందారీ రైతులసభ జరుగును. ఉదయము నగర సంకీర్తనము జరుగును. మధ్యాహ్నము సభలు జరుగును. ఫిర్కా రైతులందరు సభకువిచ్చేసి జయప్రదముగ నెరవేర్ప ప్రార్థితులు.

### బెంగాలు కాంగ్రెసు వివాద మంతరించుట.

గత పదేండ్లుగా సేనుగుప్తా సుభాషచంద్రబాబుల మధ్య రేగిన స్పర్ధ బెంగాలు కాంగ్రెసు వీటియందు భయంకర రూపమును దాల్చియుండినది. ఇప్పుడు బోసుగారు రాష్ట్రీయ సంఘ అధ్యక్షపదవిని వదలుకొని స్పర్థల సమయింప యత్నించుచున్నారు. ఇప్పటికైనను ఇవి అంతరింపనుండుట ముదావహము.

### రాజకీయ ఖయిదీలపై కాల్పుట.

వంగదేశమున హిల్జీయందు విప్లవకారులన బడిన డిటెన్యూలు తిరుగబడిరి. అంత పోలీసువారు తుపాకులగాల్పగా యిద్దరు చనిపోయిరి. 20 మందికి గాయములు తగిలినవి. కళేబరములు కలకత్తాకు గొని రాబడి మహాగౌరవముతో ఖననము చేయబడినవి. వంగీయులు యీ విషయముపై కుపితులై దేశమంతట సభలజరిపిరి.

---

7.వ పుట 3.వ కాలముకొరవ.

యీ సేవకులకిచ్చు యీ అతిస్వల్ప వేతనములో కూడకొన్ని చిక్కులున్నవి. సంవత్సరములో ఆరు మాసములకు రొఖం, మిగత ఆరుమాసములకు ధాన్యము నొసంగుచున్నారు. యీ రొఖ వేతన మెటులనో బొక్కసమున ధనము లేనప్పటికిని తిరుమల దేవస్థానమునందు ఋణముకొంకపున్నను, నిజాంవంటి రాష్ట్రములు చల్లగ యున్నంతవరకు అప్పిచ్చాకొట్టైనను ఋణము చేసినైన తెచ్చి యివ్వగలరు. యిక యీ ధాన్యవేతనము కొరకు యీ సేవకులు నియమింపబడిన గ్రామాదులకువెళ్లి ప్రాతఃకాలమునుండి, సాయం సమయమువరకు కూడునీళ్లు లేక, నానా అవస్థలుపడి రైతులవద్ద తెచ్చుకొనుటకంటె వేరుమార్గము లేదు. పాపము యీ బీదరైతుల వద్ద కొన్ని సమయములయందు తమ జమీందారుల సేవకుల కిచ్చుటకు సరియగు ధాన్యముగూడ యుండుటలేదు. యిందులకు హేతువు తమ వ్యవసాయమునకు తగినంత నీటివసతి గాని, యితర సదుపాయములు గాని తమ జమీందారులు కల్పింపకుండుటయే. జమీందారీ సేవకులాగా, యీ సేవా ఘాతమేగదా వీరలోనికి ఐకమత్యమును తొలగింపజేసి ఒకరిమీద నొకరిమీద మరియొకరికి యీర్ష్యను కలుగజేసి, నిందారోపణలు హెచ్చింపజేసి తుదకు అనాకలిపోయిన పిమ్మట రెండి దరగస్తులపాలగు చున్నారు. యింతేగాక, జమీందారుల కీర్తి కొరకు, దేశాభ్యుదయమునకు తోడ్పడక, మహాకార్యముల కడ్డుపడుచు, యితరులను వీరిపై ద్వేషభావము కలుగునట్లు చేయుకొనుచు తుదకు అధోగతిపాలగుటకు మార్గములను కల్పించుకొనుచున్నారు. యిప్పటికైనను సర్వేశ్వరుండను భగవానుడు మనసును నుద్ధరించుకొనుటకు సద్బుద్ధి, కార్యదీక్షను మన కొసంగుగాక!

ఒక సంఘీయుడు.

సంపాదకుడు, ప్రకాశకుడు:— నెల్లూరు వెంకట్రామానాయుడు; రామకృష్ణ ముద్రాక్షరశాలలో మన్నేపల్లి రామకృష్ణరావుగారిచే ముద్రితము, నెల్లూరు.